
# భూరేమునకలు




ఆ పసిబిడ్డ బక్కపల్చగా, ఎర్రగా, తేలల్లే వున్నాడు. చిన్ని చిన్ని రాగి వెంట్రుకలు చిరుగాలికి కొసలురేగి, కొంచెం పెంకితనంగా కనుపించుతున్నాడు. సన్నని ఆ మెళ్లో జెర్రి పోతులా ఒక బంగారు నానుతాడూ, దాని చివర ఒక పులిగోళ్ల పతకం వ్రేలాడుతున్నాయి. -దిగంబరి, ఉండీ లేనట్లున్న ఆ చిట్టి చిట్టి పిరుద లమీదికి,జారిజారి పోకుండా మొల చుట్టూ ఒక బంగారు గజ్జల మొలత్రాడు.

తొందర తొందరగా నడవాలనే ఉత్సాహంతో, తడబడుతున్న ఆ తప్పటడుగుల్లో కనిపించుతూనే వుంది. ఆలంబనం కోసం అనసాగిన లేత బచ్చల తీగెలా, ఆ సన్నటి ఎర్రటిచెయ్యిచాచి, మునివ్రేళ్ల చివరలతో ఆ స్త్రీ కుడి భుజాన్ని అందుకోబోతున్నాడు. ఆ ముంజేతి చివర ఆ చెయ్యి మొయ్యలేనంత బరువుగా ఒక బంగారు పలకల గాజు, వదులై జంగిడంలా వ్రేలాడుతోంది.

ముసి ముసి నవ్వుల 'సన్న జాజులు' మోవికొనలలో మోసుకెళ్లుతున్నాయ్. ఆ స్త్రీ భుజం మీద మునివ్రేళ్లాని, వారగా తలవంచి, ఆ స్త్రీ ముఖంలోకి తొంగి చూసింది. చిరునవ్వుతో ఆ బిడ్డను ఒళ్లోకి ఆహ్వానించింది ఆ స్త్రీ అడ్డాలలో పడుకోబెట్టుకుని రొమ్ము నోటికందించి పైట చెంగు కొంచెంగా కప్పింది. ఆ స్త్రీ ముంజేతుల మీదుగా రెండు మోగాళ్లు జారవేసి, ఒక లయలో ఊపుతూ ఒళ్లు మరిచి పాలు త్రాగుతున్నాడు ఆ బిడ్డ. కాళ్లకు కట్టివున్న వెండి గజ్జల జత, ఒకదాని కొకటి కొట్టుకుని 'జంగ్ జగ్ జగ్' మంటున్నాయి. ఆ బిడ్డ త్రాగుతున్న స్తన్యం రక్తంగా మారి, పాదాలకు వ్యాపిస్తున్నట్టు పాదాలు తామర రేకులల్లే కెంపులు దేరుతున్నాయ్.

ఆ స్త్రీ చామనచ్ఛాయ వర్ణంలో కొంచెం భారీ మనిషి. బలిష్టమైన కండలు తేరిన చెక్కిళ్ళు కనుమూసిన ఆ 20వ నెంబరు నేత చీరా, వెలసిబూడిద్దై పోయిన ఆ ఎర్ర బొంబాయి రవికా, ఆ తల్లి పేదరికాన్ని దాచలేకుండావున్నాయ్. చాలా మితభాషిని. ఎప్పుడూ మాట్లాడినట్టే వుండదు! అథవాయెప్పుడైనా పెదవి కదిపితే, ముసి ముసి నవ్వులు ముందు జారివడిగాని

## తెన్నేటి సూరి




పలుకులు బయటికిరాలేవు.

పండు తమలపాకుల పసిడి చెక్కిళ్లతో, పసిడి పువ్వుల యర్రబనారసు చీర కట్టుకుని మరొక ఇల్లాలు అక్కడికి వచ్చి ఆగింది. తెలుగు జాతిలో ఆవిడ చాలా అందగత్తె అనాలి. ఇరవై అయిదు సంవత్సరాల పడుచుప్రాయంలో బక్కపలచని నాజూకు మనిషి, పచ్చటి శరీరంమీద అకాసుల బంగారపు నగలు, ఎందుకూ కొరగాక వెలా తెలా బోతున్నాయ్.

"సుబ్బలక్ష్మి! తరిపి దూడలా ఇంకా వాడికి పాలేమిటి? చేరనివ్వకు! ఎన్నాళ్ళ పోయినా వాడలానే పీక్కు తింటూవుంటాడు. గూబమీద వెయ్యి వెధవని" అన్నదావిడ.

సుబ్బలక్ష్మి ఒక చిరునవ్వు నవ్వి, నిర్లక్ష్యంగా మెళ్లో వున్న నల్లపూసలు సర్దుకుంటుంది.

ఈ మాటలు చెవులబడి, ఆ బిడ్డ త్రాగే త్రాగే రొమ్ము చివాలున వదిలేసి, ముసుగ్గా కప్పివున్న పైట చెంగు చెక్న అవతలికి త్రోసేసి, ఆ వచ్చిన యిల్లాలి వంక చుర చురా చూశాడు. చారడేసి వున్నాయ్ ఆ కళ్లు. అలా చూడ్డంలో ఆ కళ్లల్లో వున్న రక్తపు జీరలు మరింత యర్రబడ్డాయి. కుడి కంట్లో వున్న నల్లటిపుట్టుమచ్చ, ఆ అరుణరేఖల నడుమ మిలమిల లాడిపోయింది.

ఆవిడ నవ్వుతూ "ఏడిశావ్ వెధవా!" అంది.

సుబ్బలక్ష్మి చిరునవ్వునవ్వి, ఆ బిడ్డను హృదయానికి హత్తుకుంది. మళ్లా రొమ్మునోటి కందించి, పైట చెంగు కప్పేసింది.

తనే జయించాడు. ఆ సంగతి ప్రతిఘటించి తన్నలా మాట్లాడిన ఆ స్త్రీకి కుళ్ళు మోతుతనం తెప్పించాలి. పాలు త్రాగుతూ పాదాలు ఇందాకటి కంటే మరింత జోరుగా ఊపేశాడు.

"ఆ! నీవలా వాణ్ని ముద్దు జూపిన కొద్దీ వాడు నెత్తి కెక్కుతాడు. వాడి జాతేం జాతి!" అంటూ నవ్వుకుంటూ వెళ్లిపోయింది.

సుబ్బలక్ష్మి ఆ బిడ్డను ఆప్యాయంగా హృదయానికి హత్తుకుంది. గర్వంతో సుబ్బలక్ష్మి. ఎడద భూదేవి వక్షస్థలం, మరింత విస్తృతమైన విచ్చులుకుని ఆ బిడ్డకు ఆశ్రయమిస్తోంది.

అంతకు పూర్వం జరిగిన విషయాలేమీ నాకు తెలియవ్. ఈ జీవితంలో నాకు కొంచెం బుద్ధి తెలిసీ తెలియడంతోటే నాకు అవగతమైన మొట్టమొదటి ఘట్టం ఇదే. అప్పట్లో నా ప్రపంచమంతా ఆ ఒక్క సుబ్బలక్ష్మే. తక్కిన విషయాలేవీ నాకు తెలిసేవీ కావూ, తెలుసుకోవాలనే అవసరంగాని ఉత్సాహంగాని నాకు వుండేవి కావు.

నన్ను గర్భిణితో వుండగా మా అమ్మకు చాలా జబ్బుచేసిందట. నీళ్లాడాక ఆవిడ దగ్గర పాలు లేకపోవడం చేత నేను పుట్టినప్పటి నుంచీ లక్ష్మే నాకు పాలిస్తూ వుండేది. మా ఇంట్లో పనంతా లక్ష్మే చేస్తూ వుండేది. బయట మా పొలం పనంతా లక్ష్మి పెనిమిటి సుబ్బన్న చూస్తూ వుండేవాడు. వంట చేసుకోటం, భోజనం చెయ్యటం ఇవే అమ్మకూ బామ్మకూ మిగిలే పనులు. చేతి నిండా పనిలేక వాళ్లకేమీ తోచేది కాదు. ఏదో చిలిపి తగవు ఒకటి లేవదీసి, ఒకరినొకరు పొద్దస్తమానమూ, తెగ సాధించుకుంటూ వుండేవారు వినేవాళ్లకి తల వాచిపోయేలా.

ఇంటెడు చాకిరీ సుబ్బలక్ష్మే యెముకలు విరుచుకుంటూ వుండేది. తెల్లవారు జామున యెప్పుడు వచ్చేదో , నేను నిద్దర లేచేటప్పటికే బండెడు చెంబులు ముందువేసుకుని వాటికి చింత పండు పులుసూ, వెలిబూడిదా పట్టించి తోముతూవుండేది. నిద్దరకళ్లు నులుపుకుంటూ వెళ్లి, ఆ వీపుమీద పడుకునేవాణ్ని. మళ్లా ఒక గుడ్డి కునుకు తీసేవాణ్ని. మా అమ్మ బలవంతాన అన్నానికి పడిలాక్కుపోయేదాకా. ఆ వెన్నుమీద నాకు లభించిన శాంతి, మళ్లీ నా జీవితంలో ఇంతవరకు మరొక తావున ఇంకెక్కడా లభించలేదు. మా అమ్మ ఎప్పుడన్నా కాసేపు ఎత్తుకుంటే ఎప్పుడు దించుతుందిరా బాబూ! అనిపించేది. ఊక దాలిపెట్టి, కిటికీలు మూసివేసిన గదిలో ఉక్కిరి బిక్కిరిగా వుండేది. మా అమ్మకి కొంచెం చిరాకుగానే వుండేది. మా అమ్మకూ నాకూ సంబంధం ఏమిటో నా కర్థమయ్యేదికాదు. అప్పుడప్పుడు మా అమ్మ నా మీద అధికారం చెలాయిస్తూవుండేది. ఏ అధికారంతో ఆవిడ అలా నా మీద జులుం చేస్తుందో నాకు తెలిసేది కాదు. అట్లాంటప్పుడు అనవసరంగా, అక్రమంగా, దుండగంగా శిక్షింపబడుతున్న ఒక పెద్ద 'మార్టీరు'కు కలిగే భావాలన్నీ నాలో కలిగేవి. 'కొట్టుకుంటే కొట్టుకో' అనే అర్థం తోచేలా నిర్లక్ష్యంగా సత్యాగ్రహం చేసేవాణ్ని బుగ్గలు ఎంతైనా మెలేసుకోనీ. కానీ, లక్ష్మి గనక అక్కడుండి, మా అమ్మను కొట్టనియ్యకుండా అడ్డొచ్చిందా ఇక జూసుకోండి, గగ్గోలుగా ఏడ్చుకుంటూ, పెద్ద పెట్టున, ఒకవిప్లవం లేవదీసేవాణ్ని.

రోజులు గడిచిన కొద్దీ, సుబ్బలక్ష్మి నుంచి నన్ను దూర దూరం చేసే సంఘటనలు ఎన్నో కల్పింపబడుతూ వుండేవి. అలాంటప్పుడు ఒళ్లంతా కుదించేసుకుని సుబ్బలక్ష్మిని అలుముకు పోవాలనిపించేది.

సుబ్బలక్ష్మి నాకు నాలుగు చుక్కల పాలిస్తుందనీ, వాటి కోసం నేనలా ఆశ్రయించుకుని తిరుగుతానని మా అమ్మ నన్ను యాసగా దెప్పి పొడుస్తూ వుండేది అప్పుడప్పుడు. కాని, ఆవిడిది వట్టి తప్పభిప్రాయమని రుజువు చెయ్యగలను. మా అమ్మ నాకు ఒక పెద్దవెండి గిన్నెడు పాలు ప్రొద్దునా, ఓ పెద్ద వెండి గిన్నెడు పాలు సాయంత్రం తాగించేది పంచదార కూడా వేసి. త్రాగకపోతే గవదబద్దలు కొట్టి మరీ త్రాగించేది. మరి,ఆ వెండిగిన్నె కోసంగాని, మాఅమ్మకోసంగాని, నా మనస్సు అలా వెంపరలాడేది కాదేం? మా బామ్మనాకు పట్టెడు పట్టెడు వెన్నపూసా, మీగడా పెడుతూవుండేది. ఆవిడకూ, నాకూ మధ్య



నిఝం

"మావారు ఆ టోపీ పెట్టుకుంటే నేను పదేళ్ళు చిన్నదానిలా అవుపిస్తానని అంటారు".

"అయితే నీ వయస్సెంత ప్రియా?"

"ముప్పై"

"నో నో, బుజ్జీ... టోపీ పెట్టుకోకుండా".

మాత్రం ఈ ఆంతర్యమేమిటి?

ఎవళ్ల లోపం వాళ్లు కప్పుకోవడానికి ఏదో అభూతవాదాన్ని ఒక దాన్ని లేవదీసి ప్రచారంలోకి తెస్తూవుంటారు. మా అమ్మ వాదం కూడా ఆ జాతిలోదే.

రంగు రంగుల పువ్వులు, గుత్తులు గుత్తులుగా గుబుల్కొని పుష్పించి పోయిన పూల మొక్కలతో నూ, నాజూకైన, సన్న సన్నని, తీపి వాసనలు వ్యాపింప జేస్తున్న చిన్న చిన్న పిల్ల వాయువులతో నూ, ఎంతో హాయిగా వుంటుందని. ఒక పార్కుకి, దాన్లోకి వెళ్లి కాసేపు కూర్చుని వద్దామని ఉబలాట పడతాం. ఆ పార్కు గేటు దగ్గర అమ్ముతున్న కారపు శనగలు కొనుక్కుతింటానికి మనమక్కడి కి వెడుతున్నామని వాదించడం అదేమంత బాగుంటుంది?కారపుశనగ లక్కడున్నై కనక అప్పుడప్పుడు మనంకొనుక్కుతింటే తింటాం కాక, 'కారపు శనగల కోసమే పార్కులోకి వెళుతున్నాను అని వాదించటం హాస్యాస్పదం.

ఒక్కొక్క వ్యక్తి హృదయం అలా నందనో ద్యానవనంలా వుండి, సౌరభ్య సౌందర్యాలను ఒలికించుకుంటూ, మానవ హృదయాలను తన లోకి ఆకర్షించుకుంటూ వుంటుంది. మరికొన్ని హృదయాలపై పల్లేరు డొంకలూ, గచ్చ పొదలూ, ఈత జీబుల ముళ్లతోపులూను, ఇంకా కొన్ని వుంటై. తడివూక దాళ్లూ నిప్పుల కుంపట్లూ!

ఇంకో చిత్రం సుబ్బలక్ష్మి నా కళ్లల్లోనుంచి నా హృదయంలోకి తొంగి చూసేది. వెంటనే నావిషయమంతా ఆవిడకు తెలిసిపోయేది. నాకు అంతే! ఆ చిరునవ్వులో నాకుస్వర్గ భూముల భోగట్టా అంతా తెలిసిందే. ఆ క్రీగంటి చూపుతో మానవ ప్రపంచ విజ్ఞానాన్నంతా 'శక్తిపాత'ం జేసినట్టు నాలో జ్వలింప జేసేది. ఆ తపస్విని, హృదయంలో వున్న ఆవేశంలో అణుమాత్రమైనా బయటికి చెప్పుకోవడానికి చాలని ఈ కుంటి మానవ భాష మనకేం చాలేదీ, ఆ రోజుల్లో.

పాలు తాగే ఈడు బాగా మించి పోయిందని, బలవంతాన పాలు మానిపించారు. కాని అదేమిటో నాకు కుతిగానే వుండేది. పాలు నా కక్కరలేదు. ఆ ఒళ్లో పడుకుని హాయిగా ఒళ్లు మరచి కన్ను మొయ్యనిస్తే చాలు. ఈ అవకాశాన్ని కూడా వాళ్లు అరికట్టడానికి చూస్తున్నారని నాకు, మా అమ్మా వాళ్లమీద ఎంతైనా ఉక్రోషంగా వుండేది. దొంగమాటుగా మా అమ్మని తప్పేసుకుని సుబ్బలక్ష్మి దగ్గరకు చేరుకునేవాణ్ని. కరుణా వాహినిలా కదిలి, ముసి ముసి నవ్వుల వెన్నెల తరగల మాలికలతో నన్ను ఆలింగనం లోకి అలుముకుని, గబ గబా ఒళ్లోకి తీసుకునేది. "దబ దబా రెండు గుక్కలు తాగెయ్!" అన్న మాటలు నిశ్శబ్దంగా ఆ మాతృ హృదయంలోనుంచి సన్నని. నా కంఠ నాళంలోకి వుక్కిలింతగా ప్రవహించిపో యేవి.

నాకు పాలివ్వటం ఒక పెద్ద గౌరవంగానే భావించుకుని లక్ష్మి గర్వపడేది. ఎందుకనో? ఈ




జ్ఞానం.... ఏంచేయాలో తెలుసుకుని ఉండటం.

నైపుణ్యం.... ఎలాచేయాలో తెలుసుకోవడం.

తెలివి.... అలాచేయకుండా వుండటం.

రహస్యం మటుకు నాకు ఇప్పటికీ సరిగ్గా అర్థంకాదు. సుబ్బలక్ష్మి హృదయంలో మూలమూ లలకు పారాడి ఆడుకునేవాణ్ని. ఆ ముత్యాల శాలంతా నాకు కొట్టిన పిండే! ఈ ఒక్కరహస్యం మట్టుకు కనిపించకుండా ఎక్కడో గుప్తంగా దాచి పారేసింది. కొంచెం పెద్దవాణ్ణయ్యాక, ఆ భవనమంతా మళ్లా ఒకసారి కలియవెదికి కను క్కుందామని బయలుదేరితే ఆ దివ్య భవనంలో వున్న విద్యుద్దీపకలన్నీ ఒకటొకటే 'టప్'న ఆరిపోయి కన్నూ కన్నూ పొడుచుకున్నా కూడా కనిపించకుండా అంధకార మావరించి అయోమ యమై పోయింది.


గౌతమి దేవులకు పాలిచ్చి తనిపిన మహా ప్రజాపతి దేవి కూడా ఇలానే గర్వపడేదని మీరంటే అనొచ్చు. కాని, దీనికి దానికీ చాలా వ్యత్యాసం వుంది. ఆతల్లి అలా గర్వపడటానికి తగినబలవత్తరమైన కారణాలు కనిపించుతున్నై. ఆ మహా శిశువు చక్రవర్తి కాబోతున్నాడని శాక్య సింహాసనానికి ముందెప్పుడో కలగబోయే గౌరవం తనవక్షస్థలం ముందుగానే దక్కించుకుంటున్నదనీ ఆమెకు తెలుసు. అదీగాక ఆ శిశువు జనించగానే పెద్ద పెద్ద జ్యోతిష పండితులంతా వచ్చి, ఈ శిశువు అపపంచోద్ధరణ చెయ్యటానికి పుట్టుకొచ్చి న మహాపురుషుడన్నారు.

మరి నా మాటేమిటి? నాకు రాజ్యాలేమీలేవే! పైగానేను, పుట్టినప్పుడు యే జ్యోతిష పండితు డూ వచ్చి నేను గొప్ప వాణ్నవుతానని చెప్పనూ లేదు. నీళ్లాడంగానే పురుట్లో నేను అహోరాత్రు లూ కప్పబట్టి యేడుస్తూ, మా అమ్మకు నిద్రాహారాలులేకుండా చేసి వేపుకు తింటుంటే వినుక్కుని"ఎలక పిల్లల్లే కీచుమంటూ, వెధవ.. వీడు బ్రతికి నిన్ను ఉద్ధరించి ఏడుస్తాడూ.....? ...పీక నులిపి ఆ పాటి మీద పారెయ్... చెవులు గింగుర్లెత్తుకుంటూ ఒకటే కీచురాయి రొద!" అందిట. ఆ శాపం ఒకటి మినహా, నాకు ఇతర మహదాశీస్సులు కూడా ఏమీ ఉన్నట్లు యెవరూ చెప్పరు.

పోనీ, లక్ష్మికి బిడ్డలు లేకపోవడంచేత బిడ్డలం టే మోజందామా?.... అలానూ అంటానికి వీలులేదు. ఆ తల్లికి కడిపెడు సంతానం. వాళ్లందరికంటే లక్ష్మి నేనంటేనే యెక్కువ ఆప్యాయంగా చూసేది.

లక్ష్మి బిడ్డలతో నేను ఆడుకునే వాణ్ని. వాళ్లేమన్నా కాస్త నన్ను నొప్పించితే, వాళ్లనువెంట నే మందలించేది. నేను వాళ్లనేమి చేసినా నన్నేమీ అనకపోగా, వాళ్లు తల్లి కదా అని తనతో చెప్పుకోవస్తే "పాపాయితో పోట్లాడుతున్నారా?" అని ఎదురు తన బిడ్డలనేమందలించుకుని, వచ్చి నన్ను ఎత్తుకుని బుజ్జగించేది. నా దురుసు తనాన్నీ, దుర్మార్గాన్నీ, తన కన్న బిడ్డ లెత్తి చూపినా ఆ తల్లి సహించేది కాదు. ఆ మాతృమూర్తి హృదయంలో నా మీద అంత కరుణ ఏమిటో?!

ఆ తల్లికి నేనెప్పుడూ ఏ విధంగానూ సాయపడలేక పోయాను. నాది అదొక దౌర్భాగ్య జీవితం. నాకు లవలేశ మేదైనా జీవితంలో సుఖశాంతులిచ్చిన ఏ వ్యక్తికీ, నా వల్ల చిల్లి



తెలివిగలవాళ్ళు. అక్కడున్న ఒక మహాయోగి, ఒక్క క్షణం కళ్ళు మూసేసి, మళ్లా తెరిచి, చిటికివేస్తూ, ఆవులించి... 'ఇశ్శో.. రంగా! సర్లే నాకంతా తెలిసిపోయింది లెండి. ఫరవాలేదు. కొంచెం వీభూదీ, సాంబ్రాణీ, ఒక కొబ్బరి కాయా, పంచె వన్నెల నూలూ తెప్పించండి ఇప్పుడే పని చేసేద్దాం'' అంటున్నాడు.

ఈ రాద్ధాంతమంతా వింటుంటే నాకు మరింత ఏడుపు ముంచుకొచ్చేస్తుంది. అసలు అదేమిటో నాకు అయోమయమయిపోతోంది. ఇక ఆ ఏడుపు నా స్వాధీనం తప్పిపోతోంది. ఆపుకుందామని ఎంతో ప్రయత్నించాను. ఆపుకో లేకపోయాను.

నేను ఎక్కెక్కి ఏడవటం దొడ్లోకి వినిపించి, సుబ్బలక్ష్మి నడవాలోకి వచ్చింది. దూరంగా నిల్చుని నా వంక అదోలా ఒక చూపు చూసింది. దాని అర్థం నాకు తెలుసు.

నీవలా ఏడవటం నాకు ఇష్టంలేదు. నీవు వెంటనే మాను అని ఆ చూపులకర్థం. అది నాకు తెలుసు. ఆపుకోవాలనే ప్రయత్నించుతూనే ఉన్నాను. ప్రయత్నించిన కొద్దీ వెల్లువలా దుఃఖం నన్ను ముంచి పారేస్తుంది.

ఆపాదమస్తకం కంపిల్లిపోతూ, ఒణికిపోతున్న గొంతును అలా అలా స్వాధీనానికి తెచ్చుకుని బలవంతాన పైకి పెగుల్చుకుని

'నాన్నా!' అని దీనంగా అర్చింది.


నిండి తొణికిసలాడుతున్న, అక్కడున్న నీళ్ల గంగాళం కంగారై, గజిబిజిగా ఏమిటో కళవళించి పోయింది. అయోమయంగా 'జివ్వు' మంటూ ఈ దుఃఖగీత ఆ సావడి అంతా వ్యాపించి 'జిమ్ము'మని ముసురు వేసిపోయినట్లయింది. ఆ అనాహతరావం ఇప్పటికీ నా రక్తనాళాల్లో మారుమ్రోగుతూనే వుంది.

నామేధస్సులోవున్న సర్వనాడులూ, స్తంభించి దిమ్మెక్కి పోవటం తప్ప ఆ ఆర్త సంఘోషణాని కి అర్థమేమిటో నాకు అప్పుడిక బోధపడలేదు. ఇప్పుడిప్పుడు ప్రపంచాన్ని అర్థంచేసుకోగా, నా కళ్లయెదుట ఒక శోకమూర్తిగా విచ్చులుకుని కనుపించుతోంది. ఈ దీనారావంలో మానవ హృదయ గుహాకుహరంలో ఘూర్ణిల్లుతున్న ఆ విషాద గాథంతా సెలయేళ్ల శోకనినాదంలాగా నిరంతరం' నా రక్త నాళాల్లో మారుమ్రోగుతూ నన్ను కలవరపరుస్తూనే వుంది. పిలుపు నాకు కాదు. నాలో యుగయుగాలుగా చివికి చివికి నిర్జీవమై నశించిపోతున్న నా మానవత్వానికే!

ఆపిలుపు విని, మా అమ్మ ఆ మూర్తివంక దీనంగా చూసి "సుబ్బలక్ష్మీ! పిల్లడూ. ఇదేమిటి?" అని బెంబేలు పడింది.

"ఏమీలేదు. కలవరపడకండి. ఇలా ఇవ్వండి"

మా అమ్మ నన్ను సుబ్బలక్ష్మి చేతుల్లోకి అందించింది. నన్ను భుజాన వేసుకుని దొడ్లోకి తీసుకువెళుతూ..." మీరిలా రండి" అని మా




అమ్మను పిలిచి వెంట తీసుకువచ్చింది. సుబ్బలక్ష్మి పడమటింటి మొత్త చాటుకు వచ్చి ఆగి, నన్ను చూసి "తింటాను మరి ఏడవకిక" అంది. మా అమ్మ వంకతిరిగి "ఆ బూరె ముక్కలిలా తెండి... నాక్కూడా ఒకటి తెండి" అనేసింది. బలవంతాన పెగుల్చుకుని, నా కోసం ఆ తల్లి తన అభిమాన హృదయాన్ని చివుక్కున రెండుగా చీరుకుంది.ఆ బాధంతా గజ గజా వణికి కంపిల్లిపోయిన ఆపెదవుల్లోంనుంచి విద్యుత్తరంగంలా దూసుకువచ్చి నా హృదయానికి కొట్టుకొనే కొట్టుకుంది.

మా అమ్మ లోపలికిపోయి బుట్ట బుట్టా తెచ్చి అక్కడ పడేసి "ఈగో సుబ్బలక్ష్మీ! తనకెన్ని కావాలో అన్ని తీసుకోమను"అంది.

"ఎన్నో అక్కర్లేదు. రెండు చాలు. ఇలా ఇవ్వండి" అని రెండు ముక్కలు తీసికుని, "ఇదిగో ! నేనూ తింటున్నానుగా తీసుకో! ఏడవకు మరి"

వర్షం చటుక్కున ఆగిపోయి, మబ్బు తునక ప్రక్కకు తప్పుకోగానే తెరదించినట్టు వరాల్ల నీరెండ వ్యాపిస్తుంది. కన్నీటి పొరజాలులో మునిగిపోయిన నా కనుకొలకులలో కాంతి రేఖలు మిల మిలా, బూరె మునిపంట కొరికాను.. యెక్కిళ్లు ఒకటొక్కటే తగ్గిపోతున్నాయి.

"ఏదో ఒకటి చెప్పి వాళ్లనందర్నీ అవతలికి పంపించి వెయ్యండి. పిల్లాడిచేత మారాం చేయించి ఇంట్లోనుంచి అవీ యివీ తెప్పించుకుని తింటుందనుకుంటారేమో?.. సిగ్గు బొట్ల పని" అన్నది సుబ్బలక్ష్మి... అవమానంతో అలమటించి పోతూ.. ○

## ప్రజా వైద్య వేదిక

డాక్టర్ కూటికుప్పల సూర్యారావు, ప్రముఖ వైద్యులు విశాఖపట్నం 'ఉదయం' పాఠకుల ఆరోగ్య సంబంధమైన ప్రశ్నలకు జవాబులిస్తారని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. పాఠకులు తమ ప్రశ్నలను వేరుగా ఈ క్రింది చిరునామాకు పంపాలి.



డాక్టర్ కూటికుప్పల సూర్యారావు
శ్రీ సూర్యా క్లినిక్
మెయిన్ రోడ్
కంచరపాలెం
విశాఖపట్నం—530 008.